"ప్రపంచమంతా నా కళ్ళకు ఆరవేసిన సిల్కు-చీరలా కనిపిస్తూంది!" అని.

ఇంతగా తన హృదయంవిప్పి నాతో చెప్పగలిగిన ఆ మిత్రుడ్ని నేను ఈ రోజువరకూ అభినందించి, మెచ్చుకుంటాను. ఎందుకంటారా? తప్పనిసరియైన నిజాన్ని చెప్పడానికి అతడు సందేహించలేదు గనక!

* * *

కొందరు మగవాళ్లు తమ ఆడవాళ్ళమీద తమకు గల ప్రేమాతిశయాలన్నిటీ్న కొత్త-చీరల రూపంతో ప్రదర్శిస్తూంటారు. ఈ కొత్త చీరలుచూసి తమ భార్యలు తమను మెచ్చుకోవాలనీ కాదు-తమ ఘనత వారికి చూపెడదామనీ కాదు - తమ కంటికింపైన చీరలో తమ ఆడవాళ్ళనుచూస్తే వచ్చే ఆనందాన్ని, పారవశ్యాన్ని పొందుదామని! అందమైన చీరల్ని నిషేధించి ఆడవాళ్ల నందర్నీ అలుకుగుడ్డలతో అలంకరించండి - ఆ మర్నాటినుంచీ విడాకులకోర్టులు అమలులోకి రాకపోతే చెవి తెగ్గోసుకుంటాను!

---

# పునాదిరాళ్లు

"నీకు నెలకు పదహారువేలొస్తే సరిపోతుందా?"

'పదహారువేలా? ఏమిటవి—రాళ్లా రప్పలా?'

'రూపాయలు! పదహారువేల రూపాయలు—?'

'ఒక నెలకా?'

'అవును-నెలకు పదహారువేల రూపాయలు-సరిపోతుందా?'

'ఆలోచించి చూడాలి-సరిపోతుందో లేదో-ఈ కరువు రోజుల్లో-'

'ఆలోచించిచూడు. రేపు చెబుతావా?'

'ఈ రాత్రి ఆలోచిస్తా-పదహారూవేలేనా, పైగా డియర్‌నెస్ అలవెన్సుకూడా ఏమైనా...?'

'అది నేను ఆలోచించాల్సిన విషయం-కొంచం ఓపికుంటే ఆలోచించి చెబుతా-'

'ఆలోచించు-డియర్‌నెస్ అలవెన్సు ఎలాగైనా వుండాల్సిందే-వెధవ పదహారువేలు ఏ మూలకి? ఈ మధ్య గవర్నర్లు కూడా పుచ్చుకుంటున్నారు అనేక అలవెన్సులు-'

'ఇచ్చేది ప్రభుత్వమైతే ఎంతైనా యిస్తుంది. పుచ్చుకునేవారు ఎంతైనా పుచ్చుకోవచ్చు-నేనెంత నా బ్రతుకెంత-మొత్తం నా అంచనా ప్రకారం నెలకు ఆదాయమెంత వస్తుందో తెలుసునా?'

'తెలీదు !'

'నలభై వేలు మాత్రమే !-అందులో పదహారు వేలు నీకు యివ్వదలిచాను. నేను మేనేజింగు డైరక్టర్ను గనక మిగతా ఇరవై నాలుగు వేలూ నాకూ. ఏం, న్యాయంగా లేదూ? నీకు డియర్‌నెస్ అలవెన్సు యివ్వాలంటే నా ఇరవై నాలుగు వేలలోంచే ఇవ్వాలి-ఆలోచిస్తాన్లే-'

'సరే-ఏదో ఒక రెండుమూడు వేలైతే చాల్లే, జీతం పదహారు వేలూ గాక-'

ఆలోచిస్తానన్నాగా? ఎంత వీలైతే అంతా యిస్తా. ఎంతో ఇప్పుడు చెప్పలేను. 'ఇంతా' అని నువ్వు ఆశ పెట్టుకోవద్దు-జీతంమట్టుకు పదహారు వేలు నిశ్చయం-'

'నిశ్చయం !'

'నువ్వు వప్పుకున్నట్టేనా?'

''ఓ !''

'ఇష్టంలేకపోతే ఇప్పుడే చెప్పెయ్యి-అంత్య నిష్ఠూర్యంకన్న ...'

''ఇష్టమే !''

'సరే అయితే ఈ విషయం తేలిపోయింది-అబ్బ ! వ్యాపారంలో దిగడమంటే మాటలా? ఒక్కొక్క విషయం తెముల్చుకు వచ్చేసరికి తాతలు దిగివస్తారు-'

'దిగివస్తారు !'

'సరే ఇంక తరువాయి కార్యక్రమం-నువ్వు ఎడిటరువి-నేను-'

'మేనేజింగు డైరక్టరువి !'

'ఈ వ్యాపారానికి మూలం నేను గనక, పెట్టుబడిదారును నేను గనక నేను మేనేజింగు డైరెక్టరుని-'

'ఎడిటింగ్ వ్యవహారాలు చూసేది నేను గనక నేను ఎడిటరునా?'

'అవును! నీకు జీతం పదహారు వేలు-'

'అలవెన్సుమాట తరవాత ఆలోచిద్దువు గానిలే-'

'నాకు కారుందని నీవు నిరుత్సాహపడకు-నీకూ ఒకటి కొనిస్తాలే-'

'థ్యాంక్స్'

'నేనో లేడి టైపిస్టుని వేసుకుంటా-'

'ఉ-'

'నువ్వు నిరుత్సాహపడబోకు-నీకూ ఒక లేడీ టైపిస్టును...'

'థ్యాంక్స్'

'మన ఆఫీసు ఎక్కడవుంటే బాగుంటుంది-'

'మాంటురోడ్డులో అయితే బాగుంటుందేమో?'

'బాగుండొచ్చు!'

'సరే! అక్కడికది స్థిరపడ్డది-మరి ఇతరవిషయాలు-'

'ఎలాటివీ?'

'పెట్టుబడి.!....'

'పెట్టుబడి లేదా?'

'లేకపోవడ మేమిటి నీ మొహం? నెలకు నలభైవేలు లాభంవచ్చే వ్యాపారానికి పెట్టుబడి లేకపోవడ మేమిటి?'

'మరి ఇతర విషయాలంటే?'

'వాటినిగురించే ఇంక మనం ఆలోచించాల్సింది-'

'ఆలోచించేద్దాం-పట్టు'

'ముందు మనం 'హిందూ'లో ఒక ప్రకటన చెయ్యాలి-'

'ఏమని?'

'ఇలాగ ఒకపత్రిక పెడుతున్నామనీ, ఏజంట్లు మనతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరపమనీ-'

'ఏజంట్లెందుకు-పేపర్లు అమ్మడానికా?'

'అవును-ఈరోజుల్లో ఏజెంట్లు లేనిదే పేపర్లెలా ఖర్చవడం? వారికి నూటికి ఇరవైయైదు చొప్పున కమిషన్ యిస్తాం-'

'బాగుంది ఏర్పాటు-'

'ఏజట్లు ముంగుగా మనదగ్గర కొంతడబ్బు ధరావతు కడతారు-'

'బాగుంది.'

'ఇదిగాక అడ్వర్టయిజ్మెంట్సు కోసం మనం 'హిందూ'లో ప్రకటన చేయాలి-'

'తప్పకుండా!'

'ఎడ్వర్టైజ్మెంట్లమీద ఎంత ఆదాయం వస్తుందో తెలుసునా?'

'తెలీదు-'

'తెలుసుకో-మనకు నెలకు రాబోయే నలభైవేలలోనూ ముప్ఫయ్యొనిమిదివేలు ఎడ్వర్టయిజ్మెంట్లమీదవచ్చే ఆదాయమే'

'అలాగనా?'

'అవును! సరే, యిదికూడా తేలిపోయినట్టే. పోతే మిగిలిందల్లా-రేపు మనం ప్రకటనరాసి 'హిందూ'కు పంపించడం'

'తప్పకుండా పంపిద్దాం.'

'ముందుగా 'ధరావతు కట్టగలిగిన ఏజంట్లుకావాలి' అని ప్రకటన చేద్దాం-'

'చేద్దాం-'

'అలాచేస్తే కొన్నాళ్ళపాటు మనకు రోజూ ఏజంట్లదగ్గర్నుంచి, మనియార్డర్లు వస్తూంటాయి-'

'మన పేపరుకు ఈ ధరావతులే పెట్టుబడి అన్నమాట-'

'ఛ! మనకేం లోటోయి-నెలకు నలభైవేల ఆర్జన కళ్ళచూడబోతున్నాం-'

'కళ్ళు జిగేలుమంటున్నాయి!'

'నాకు ఇరవై-నాలుగువేలూ, నీకు పదహారువేలూ-'

'డియర్ గెస్ అలవెన్సు మాట తరవాత ఆలోచిస్తావుగా-?'

'ఓ! సరేగాని, రేపు మనం ఏజంట్లు కావాలని 'హిందూ'లో వేయబోయే అడ్వర్టయిజ్మెంటుకు చార్జి ఎంతవుతుందో తెలుసునా?'

'తెలీదు!'

'ఎనిమిది రూపాయలకంటే అవదు-'

'ఇంతేనా?'

'ఇంతే!'

'అయితే రేపే రాసి పంపించేద్దాం?'

'సరే కాని ఇలా చూడూ, ఈ సెలాఖర్న నీకు నేను ఇవ్వబోయే పదహారువేలతోబాటూ కలిపి యిచ్చేస్తాను గాని, ఎనిమిది రూపాయలంటే ఇట్టా ఇవ్వు-'

'...............?'

---

# అందాల వేట

అందచందాలు పుట్టకతో రావాలిగాని కొనుక్కుంటేనూ, అంటించుకుంటేనూ వస్తాయా అంటూంటారు పెద్దవాళ్లు. ఇందులోని సత్యాన్ని యేనాడో కాదంది మన ప్రపంచం-

అందంగా కనుపించ దలచుకున్నవాళ్లకి అందచందా లక్కర్లేదు. పుట్టకతోనే వెన్నెల తీగలకుమల్లే ప్రకాశించ నక్కర్లేదు.

అందమంటే నలుగురిలోనూ రాణింపు - కాస్త నిగనిగ - కొంచం తళుకూ, బెళుకూ. పుట్టకతో వచ్చేది శరీరమూ, అవయవాలున్నూ. అందంకాదు. అందమనేది ఆ శరీరంమీదా, అవయవాలమీదా కాల క్రమేణా తీర్చి, దిద్దుకుంటూండాల్సిన తీరువు.

అందమైన అమ్మలక్కలు పుట్టరు-పుట్టిన పిమ్మట రత్నాలకు మల్లే సానపెట్ట బడతారు. ఇదీ అందాల తీరు.

మీరు అందంగా పుట్టలేదనీ, మీ మూతి కోతిమూతిలా వుంటుందనీ, మీరూపం దుమ్ములగొండిని పోలివుంటుందనీ మీరు చిన్నబుచ్చుకో నక్కర్లేదు.